www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 జనవరి 2025



మెరుగైన వైద్య సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కంసలవీధిలో నూతనంగా నిర్మించిన విష్ణు డెంటల్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డెంటల్ క్లిక్‌ను ప్రారంభించడం ఎంతో శుభప్రదమన్నారు. రాబోయే రోజులలో ఈ క్లినిక్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. మెరుగైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. మంత్రి మండిపల్లికి విష్ణు డెంటల్ క్లినిక్ నిర్వాహకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గిన సం'క్రాంతి'

- పేదలు గాలికి..సంపన్నులకు బిల్లులు
- పట్టాలకెక్కని సంక్షేమం..సన్నగిల్లిన కొనుగోలు శక్తి
- అప్పల ఊబిలో పేదలు, సామాన్యులు



పార్వేట సందర్భగా వేంపల్లెలో వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సంక్రాంతిశోభ మసకబారింది. 2024 సంవత్సరంతో పోలిస్తే అప్పులతిప్పల మధ్య సంక్రాంతి సాగుతోంది. 2019-24 పీరియడ్‌లో వైసిపి సర్కారు పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్, జనవరి మాసాల్లో అమ్మఒడి, రైతుభరోసా, నేతన్ననేస్తం వంటి పథకాలకు నిధులు విడుదల చేసింది. పేదలు, నిరుపేదలు, సామాన్యుల జేబుల్లోకి డబ్బులు చేరడంతో పండుగ అవసరాలు తీరడం తెలిసిందే. ప్రస్తుత కూటమి సర్కారు పేదలను, సామాన్యులను గాలికి వదిలేసింది. తాజాగా రూ.6,700 కోట్లతో కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, ఎంఎస్‌ఎంఇ వ్యాపారుల, చిరువ్యాపారులకు బిల్లుల చెల్లింపులు చేస్తున్నట్లు ప్రకటించింది.

జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువన 5,86,352 లక్షల కుటుంబాలు ఉన్నాయి. గత వైసిపి సర్కారు పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఫలితంగా భోగి మంటలు వేయడం మినహా పండుగల అవసరాలైన దుస్తుల కొనుగోలు, షాపింగ్, తినుబండారాలు, సాంస్కృతిక పోటీల ప్రదర్శనల్ని పేదలు, సామాన్యుల ఖాతాల్లో డబ్బులు జమకావడంతో పండుగ అవసరాలకు ఇబ్బందులు తప్పేవి. ఇంటిల్లిపాదీ కలిసి సంక్రాంతి సంబరాలను జరుపు కునేవారు. ప్రస్తుత కూటమి సర్కారు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పండుటాకులకు పెంచిన పింఛన్ రూ.4 వేలు ఇవ్వడం మినహా మిగిలిన సంక్షేమ పథకాలను అటకెక్కించింది. ఫలితంగా సామాన్యులు, పేదలు, నిరుపేద కుటుంబాలు అప్పులకూపంలో కూరుకుపోయారు. ఇంటిల్లిపాదీ కలిసి సంక్రాంతి సంబరాలను సంతోషంగా ఆస్వాదించడానికి అవకాశం లేకుండా పోయింది.

కూటమికి పట్టని సంక్షేమం

కూటమి నాయకత్వం ఇచ్చిన హామీలను సైతం అమలు చేయని పరిస్థితి నెలకొంది. సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలును చెప్పాల్సిన అవసరమే లేకుండాపోయింది. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, నేతన్ననేస్తం ఇతర సంక్షేమ పథకాల పేర్లను మార్చడం మినహా ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. అన్నదాతా సుఖీభవ పథకం నిధులను డిసెంబర్ మాసంలో రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచి ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోని పరిస్థితి నెలకొంది. సూపర్‌సిక్స్‌తోపాటు పలు సంక్షేమ పథకాల్ని ఆశించిన సామాన్యులు, పేదలు, నిరుపేదలు అప్పుల అగాదాల్లోకి కూరుకుపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

పండుగతో..ఫీజుల పోటీ

జిల్లాలో ఒక వైపు సంక్రాంతి పండుగ, మరోవైపు ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ మధ్య సామాన్యులు నలిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో సుమారు 1,80,941 విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఎఫ్‌ఎ-3 పేరుతో పరీక్షలు నిర్వహించి నిబం ధనల ప్రకారం ఫీజులు చెల్లించని విద్యార్థులకు హాల్‌టికెట్ల పేరుతో ఆలస్యంగా పేపర్లు ఇవ్వడం వంటి వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం తల్లికివందనం పథకం అమలును మరుసటి ఏడాదికి వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవం పథకం నిధుల విడుదలకు మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేస్తోంది. అభివృద్ధి జపం పేరుతో పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, సంపన్నులకు బిల్లుల చెల్లింపులు చేయడానికి ముందుకు వచ్చింది. ఈనెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నఫళంగా ఆర్థికమంత్రి, ఇతర సహచర మంత్రులను ఆకస్మికంగా పిలిపించుకుని సంక్రాంతి కానుకల పేరుతో రూ.6,700 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. చిన్నకాంట్రాక్టర్లు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఎంఎస్‌ఎంఇఒ నిర్వాహకులు పెద్దసంఖ్యలో ఉండడం గమనార్హం. పేదలు మచ్చుకైనా కనిపించని పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,400 కోట్లపైగా ఫీజురియింబర్స్‌మెంట్ చెల్లింపులకుగానూ రూ.788 కోట్ల విడుదల చేసినట్లు పేర్కొనడం తెలిసిందే. మిగిలిన పెండింగ్ బకాయిల పరిస్థితేమిటో తెలియని పరిస్థితి నెలకొంది.

18న మైదుకూరుకు సిఎం చంద్రబాబు రాక

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చాపాడు (మైదుకూరు)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18న జిల్లా పర్యటనకు రానున్నారు. ఈనేపథ్యలో బుధవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్, జెసి అదితిసింగ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరుకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మైదుకూరు పట్టణ ప్రాంతంలో పర్యటించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాలు, కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అందుకు సంబంధించి ఆయా జిల్లా అధికారులు నివేదికలను తయారుచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. తొలుత వారు సభా వేదిక ప్రాంగణం, హెలిపాడ్, డంపు యార్డ్‌లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధకారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఆర్‌కె నగర్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

- ప్రభుత్వ విప్ మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆర్‌కె నగర్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మధవి పేర్కొన్నారు. బుధవారం ఆమె నగరంలోని ఆర్‌కె నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు పలు సమస్యలు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు కాలనీ వాసులకు ఇచ్చిన మాట ప్రకారం సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మురుగు కాలువలు, రోడ్లను త్వరతగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తమకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించి తమ సమస్యలు విన్నందుకు అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఏనాడు వైసిపి నాయకులు తమ డివిజన్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని వాపోయారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని 48వ డివిజన్లలో చిట్టా శివారెడ్డి, రెడ్డి హుస్సేన్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, యువ నాయకులు శ్రావణ్, రాజ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు సంప్రదాయాలకు ఆనవాళ్లు ఉన్నారు. ఎద్దుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. పశు సంతతి వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన జతలకి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పోటీలను వీక్షించారు. నగరంలో పారిశుధ్య పనులు, సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు సచివాలయ సిబ్బంది ద్వారా అందజేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలను మంగళవారం ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్‌తో కలిసి 23వ డివిజన్ నాగరాజు పేటలో డివిజన్ రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ లోపల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రజలకు పెన్షన్లు అందుతున్న దారుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, రవితేజ, బాల, వెంకటసుబ్బయ్య, రమణ, అనిల్, అశోక్, షబ్బీర, శిరీష, లీలా పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు



కడప శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు

శిల్పారామంలో ముగిసిన
సంక్రాంతి సందడి

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని శిల్పారామంలో సంక్రాంతి ముగింపు సందర్భంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ప్రాచీన సాంప్రదాయాలను గౌరవిస్తూ నగరవాసులకు హరిదాసు వేషాలు, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మిస్పా మూవీ సహకారంతో కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. కాంటినెంటల్ రీజనల్ మేనేజర్ భువనేశ్వర్ రావ్ హాజరై వచ్చిన ప్రేక్షకులకు ఉచితంగా కాంటినెంటల్ కాఫీ ని అందజేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివపసాద్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమాలను జయప్రదం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

పులివెందుల టౌన్ : శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. బుధవారం సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా ముగిశాయి సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ పండుగ రోజు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జె.సాయి వెంకట రవితేజ, సాయి ఆక్వా బోటింగ్ వారి సహకారంతో డ్యాన్స్ మాస్టర్ రాజా, శ్రీ రాజా కళా నిలయం ఆధ్వర్యంలో వారి చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో ప్రేక్షకులను ఎంతగానో అక్కట్టుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పరిపాలన అధికారి సుధాకర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, సుబ్బా రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందుల శిల్పారామంలో..

సైనికులను గౌరవించుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సైనికులను గౌరవించు కోవడం అందరి బాధ్యతని కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ పేర్కొన్నారు. జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మాజీ సైనికుడు చిప్పిలి మల్లికార్జునరెడ్డిని వైసిపి నాయకులు యూనస్, కొత్తపల్లి మహేష్ బాబు, యువ నాయకులు చరణ్, యాసీన్ తదితరులు కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడే యోధులు సైనికులన్నారు. తమ కుటుంబాలను వదిలేసి విదేశీ దాడుల నుండి దేశాన్ని రక్షించే అసలు సిసలైన వారియర్స్ అని గుర్తుచేశారు. దేశ రక్షణలో మాజీ సైనికుడు చిప్పిలి మల్లికార్జునరెడ్డి తనవంతు పాత్ర పోషించారని, ఆయనను సన్మానించుకోవడం గర్వంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరపున దేశ సైనికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పిపి-1, 2 తరగతులు ప్రారంభించాలి

రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం, ఉర్దూ సెక్షన్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో పిపి 1, పి పి 2 తరగతులు ప్రారంభించాలని, ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉన్నత పాఠశాలలుగా అప్గ్రేడ్ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని నగరపాలక ఉర్దూ పాఠశాల (సాలె నాగయ్య) లో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15 గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ ఉర్దూ కాంప్లెక్స్ లను యధావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ లలోనే నిర్వహించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలలో 20 మంది మైనార్టీ విద్యార్థులు ఉన్నచోట రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేసి భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హాకీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్మెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫకృద్దిన్ మాట్లాడుతూ ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలనీ కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హాకీం, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరామతుల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా, జిల్లా నాయకులు ఖాదర్ బాషా, అబ్దుల్ ముజీబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్

సోలార్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

ఏర్పాటు పట్ల వినియోగదారుల ఆసక్తి



ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

సోలార్ విద్యుత్ పట్ల వినియోగదారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా 2 కెవి సోలార్ ప్యానలను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా పిఎం సూర్యా ఘర్ యోజన ద్వారా ప్రతి ఇళ్లు ఒక సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావాలని చెప్పారు. ఒసి, బిసి, జనరల్ కేటగిరిల్లో ఎవరైనా సోలార్ ప్యానల్ బిగించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం వారికి సబ్సిడీ ఇస్తోంది. 2 కెవి సోలార్ ప్యానల్ బిగించుకునే వారికి రూ. 60 వేలు, 3 కె.వి సోలార్ ప్యానల్ బిగించుకునే వారికి రూ. 70 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. మూడు కె.వి పైన ఎంత బిగించుకున్నా సబ్సిడీ మాత్రం రూ. 78 వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి వస్తుంది. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని గత ఏడాది జనవరి నెలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కోటి మంది ఇళ్లపై సోలార్ ప్యానలను బిగించే ఉద్దేశంతో ఏర్పాటు చేసింది. పేద, మధ్య తరగతి వర్గాలు లబ్ధి పొందేందుకు ఈ పథకం ఏర్పడింది. ఆన్‌లైన్‌లో pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్‌సి, ఎస్‌టిలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతూ ఉంది. సంబంధిత విద్యుత్ అధికారుల వద్దకు వెళితే రిజిస్ట్రేషన్ చేస్తారు. లబ్ధిదారులు ఎస్‌సి, ఎస్‌ట కాలనీల్లోనే నివాసం ఉండాలి. సోలార్ ప్యానల్ బిగించేందుకు ఇంటి పై కప్పు స్లాబు ఉండాలి. స్లాబు లేకుంటే బిడువు స్థలం అయినా ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత పలు కంపెనీలు సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసేందుకు వర్క్ తమకు ఇవ్వాలని కోరుతూ వినియోగదారుల వద్దకే వస్తాయి. ఒక్కో కంపెనీ రేటు ఒక్కో విధంగా ఉంటుంది. మోనోక్రిస్టలైన్ ప్యానెల్లు అధిక సామర్థ్యం, పాలీక్రిస్టలైన్ ప్యానెల్లు (ధర తక్కువ) కొంచెం తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. మంచి ప్యానలను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఉత్పత్తి బాగా జరుగుతుంది, దీర్ఘకాలిక మన్నిక వస్తాయి.వాటి సామర్థ్యాన్ని పెంచడానికి ప్యానెల్‌ల కోణం, దిశ కీలకం. మూడు కె.వి ఇన్సులేషన్ రూ. 2.30 లక్ష వరకు ఖర్చు వస్తుంది. సబ్సిడీ మొత్తం రూ. 78 వేలు లబ్ధిదారుడి ఖాతాలో పడుతుంది. 3 కెవి సిస్టమ్ కోసం, 250-300 చదరపు అడుగుల స్థలం అవసరం. 3 కెవి ఏర్పాటు చేసుకుటే చేసుకుంటే సుమారు నెలకు 400 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంటున్నారు. సుమారు 40 సంవత్సరాలు వరకు ఆ ప్యానళు పనిచేస్తాయని తయారీ కంపెనీలు చెబు తున్నాయి. అంటే 40 సంవత్సరాల వరకు మనం ఉత్పత్తి చేసుకున్న విద్యుత్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చు. ప్రతినెల కరెంటు బిల్లుల టెన్షన్ ఉండదు. మనకు తయారైన విద్యుత్తును మనం వాడకపోతే లైనుకు వెళ్ళిపోతుంది. అందుకు ప్రతిఫలంగా వినియోగదారునికి ఒక్కో యూనిటుకు రూ.2.10 ప్రభుత్వం లెక్కేసి ఇస్తుంది. పగలు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వినియోగం తక్కువ ఉటుంది. రాత్రికి విద్యుత్ ఉత్పత్తి కాదు. వినియోగం ఎక్కువ అవుతుంది. అవసరమైనప్పుడు లైన్ నుంచి వాడుకోవడం జరుగుతుంది. ఈ క్రమంలో వినియోగించిన, ఉత్పత్తి అయిన విద్యుత్తు ట్రాలీ చేసి బిల్లును చేయడం జరుగుతుంది. ఎసి, ఎస్‌టియు 2 కెవి సోలార్ ప్యానలను మాత్రమే బిగిస్తారు. ఇందుకు గాను రూ. 60 వేలు కేంద్రం, మిగతా అమౌంటు రాష్ట్ర ప్రభుత్వం భరించి వారికి ఉచితంగా ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా ప్రభుత్వం ఇస్తోంది.

ఈ వ్యవస్థలో సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్, మౌంటు స్ట్రక్చర్, వైరింగ్ ఉంటాయని ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోలార్ ప్యానెల్లు సూర్యరశ్మిని గ్రహించి, దానిని డిసి విద్యుత్‌గా మారుస్తాయని తెలిపారు. ఇన్వర్టర్ ఈ డిసి విద్యుత్‌ను ఎసిగా మారుస్తుందన్నారు. ఇంట్లోకి సరిపడా విద్యుత్‌ను తీసుకొని, మిగులు విద్యుత్తును తిరిగి గ్రిడ్‌లోకి పంపుతుందని, సూర్యకాంతి, వాతావరణంపై ఆధారపడి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిఆపరు. ఇంటి విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్యానల్ బిగించుకోవడం మంచిదని పేర్కొన్నారు. జనరల్ కేటగిరి వారికి 2 కెవికి రూ. 60వేలు, 3కెవికి రూ. 78 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇస్తుదని తెలిపారు.

విద్యుత్ బిల్లులు ఆదా...

నేను ప్రభుత్వ సహకారంతో 3కెవి సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్నాను. సోలార్ బిగించుకోవడం వల్ల కరెంటు బిల్లు రూ. 300 వచ్చింది. గతంలో రూ. 2 వేలకుపైగా వచ్చేది. 3 కెవికి రూ. 2.20 లక్షలు ఖర్చు అయింది. ఇందుకు బ్యాంకులో రుణం తీసుకున్నాను. రూ. 78 వేలు సబ్సిడీ కేంద్రం ప్రభుత్వం నుంచి నా అకౌంట్ లో పడింది. విద్యుత్ ఎంత ఉత్పత్తి అవుతుంది ఇన్వర్టర్‌లో కనిపిస్తూ ఉంటుంది. ఎండలు తక్కువగా ఉండడం వల్ల కొంచెం తక్కువ ఉత్పత్తి అవుతుంది. నెలకు 350 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ప్రతినెల విద్యుత్తు ఎంత జనరేట్ అయింది, ఎంత ఖర్చు అయింది, ఎంత గ్రిడ్డుకు వెళ్ళింది అనేది బిల్లు వస్తోంది. ఇంట్లో ఎసి, ఫ్రిజ్జు, వాటర్ మోటర్ తో పాటు విద్యుత్తు పరికరాలు ఉన్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్తు సరిపోతోంది.

-షేక్షావలి, సోలార్ వినియోగదారుడు ఎర్రగుంట్ల.



బహుమతులు సాధించిన విద్యార్థులు

పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మరియాపురం, ఎస్‌బిఐ కాలనీలో ఉన్న పీస్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 12న థియరీ వి కె స్పోర్ట్స్ స్టేడియం, కగ్గదసాపుర, బెంగుళూరులో నిర్వహించిన ది ప్రిన్స్ కప్ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొని 4 గోల్డ్, 3 బ్రోంజ్ మెడల్స్ గెలుపొందాలని పీస్ ఇస్లామిక్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. 6వ తరగతి కి చెందిన షేక్. ఇబ్రహీం కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6 వ తరగతి కి చెందిన ఇబ్రహీం ఖలీలుల్లా కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6వ తరగతి కి చెందిన సయ్యద్ సుహెల్ కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6వ తరగతి కి చెందిన సి ఎస్. ఇషాక్ కయోరూజీ గోల్డ్, పూమాసే గోల్డ్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతో పాటు ఆటలలోనూ, కరాటేలో మంచి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధిస్తారని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మైదుకూరులో శ్రీకృష్ణదేవరాయల
కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమను రత్నాలసీమగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మైదుకూరు పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. నాలుగు రోడ్ల కూడలిలో విగ్రహ ఏర్పాటుతో పాటు ఎల్ఇడి దీపాలు, ఎత్తైన జాతీయ జెండాను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధిపరిచేందుకు నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. మాధవరాయ స్వామి పార్వేట ఉత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనపాల జగన్, మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఏపీ రవీంద్ర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



గాలిపటాలు ఎగురవేస్తున్న తులసిరెడ్డి, ప్రజలు

పండుగలు అనుబంధాలను పెంచుతాయి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పండుగలు అనుబంధాలను పెంచడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో, ఖమర్ మాధుతో కలిసి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి గాలి పటాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి రైతుల, పల్లెల పండుగ అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీవో 22ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబం ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు వేయాలని కోరారు. పండుగలు మానవ జీవితంలో అంతర్భాగమన్నారు. అనేక పండుగలు ఉన్నప్పటికీ మకర సంక్రాంతికి ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. ఇది తెలుగు వారికి పెద్ద పండుగ, రైతుల పండుగ, పల్లెల పండుగ, అల్లుళ్ళ పండుగ అన్నారు. పశుపక్ష్యాదులు, జంతు జాలాదులు మానవ పరివారంలో అంతర్భాగమని సంక్రాంతి పండుగ చెప్పుతుందని చెప్పారు. ప్రకృతికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధానికి ఈ పండుగ ప్రతీక అన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, గాలిపటాలు, బుడబుక్కల వారు ఈ పండుగ ప్రత్యేకతలు అన్నారు. రంగవల్లులు చూస్తే నేల తల్లిని తమ బిడ్డలు రంగు రంగుల చీరలతో అలంకరించినట్లు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, మాధవి రెడ్డి, వేమా రాజా, మహబూబ్ బాషా, రవి, ఆరుసేర్ల సుబ్బరాయుడు, బద్రీనాథ్, వెంకటేష్, రాజు, మహబూబ్ బాషా, రవి, రమణ, నాగరాజు, నాగార్జున, ప్రసాద్, వెంకటస్వామి, వినయ్ పాల్గొన్నారు.

కొప్పల నాగమల్లారెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



పులివెందుల పట్టణంలోని మారుతీ థియేటర్ ఎదురుగా ఉన్న కొప్పల నాగ మల్లారెడ్డి (50) నేత్ర దానం చేశారు. ఆయన తల్లి నారాయణమ్మ, కుమారులు సాయి మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కుమార్తె లక్ష్మీదేవి నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో వారు నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు మరణించిన నేత్రదానం కోసం అంగీకరించి 9966509364 లేదా 7093204537 లకు సమాచారం ఇచ్చి మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసి అంధ రహిత సమాజం కోసం ప్రతి కుటుంబం నేత్రదాన బృహత్కార్యాన్ని కుటుంబ సంప్రదాయంగా అలవరచుకోవాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తి కార్నియాలు ఇద్దరు అంధులకు చూపు ఇస్తాయని, ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

గండి దేవస్థాన చైర్మన్ బరిలో సింగారెడ్డి జయచంద్రారెడ్డి!

ప్రజాశక్తి - వేంపల్లె



జిల్లాలో పుణ్యక్షేత్రమైన గండిక్షేత్ర దేవస్థానం చైర్మన్ బరిలో వేంపల్లెకు చెందిన టిడిపి నేత సింగారెడ్డి జయచంద్రారెడ్డి ఉన్నట్లు సమాచారం. గత వైసిపి పాలనలో వీరన్నగట్టుపల్లెకు చెందిన కృష్ణా తేజాకు అ పార్టీ నాయకులు చైర్మన్ పదవిని కట్ట బెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇడుపులపాయకు చెందిన వెంకట స్వామి దేవస్థానం పదవి ఇవ్వాలని టిడిపి నేతలను కోరారు. టిడిపి పార్టీ కోసం తాను కూడ కృషి చేశానని కాబట్టి ఈ సారి తనకు కూడ గండి దేవస్థానం చైర్మన్ పదవిని ఇవ్వాలని సింగారెడ్డి జయచంద్రారెడ్డి పట్టు పట్టినట్లు తెలిసింది. వేంపల్లెలోని వృషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు గతంలో జయచంద్రారెడ్డి చైర్మన్‌గా ఉండి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన అనుభవం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో జయచంద్రారెడ్డి కూడా టిడిపి టికెట్ కోసం పట్టు విడవని విక్రమార్కుని లాగా ప్రయాత్నాలు చేపట్టారు. కృష్ణారెడ్డి కుటుంబం అంటే మండల వ్యాప్తంగా గుర్తింపు ఉంది. గండి దేవస్థానం చైర్మన్ కోసం టిడిపి పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే గండి దేవస్థానం రేసులో ఇడుపులపాయకు చెందిన వెంకటస్వామి పేరు ఉండగా రెండవ పేరు సింగారెడ్డి జయచంద్రారెడ్డి విన్పిస్తోంది. గత టిడిపి పాలనలో వెంకటస్వామి కూడ గండి చైర్మన్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో వేంపల్లెకు చెందిన వ్యక్తులకు కూడ గండి చైర్మన్ పదవికి ఒక సారి అవకాశం ఇవ్వాలని కొందరు టిడిపి నేతలు అధిష్టానం దృష్టికి తెచ్చినట్లు సమాచారం. టిడిపి అధిష్టానం ఎవరి పక్క నిలుస్తుందోనని పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కూటమి పాలన అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు అవుతున్నా ఇంత వరకు దేవస్థానం పాలక మండలిని రద్దు చేయక పోవడంతో వైసిపి పాలనలో నియమించిన వారే చైర్మన్‌లుగా కొనసాగుతున్నారు. కూటమి పాలన దేవస్థానం పాలక మండలి రద్దు చేసే వరకు తామే చైర్మన్లుగా ఉంటామని బహిరంగంగా అంటున్నారు. ఆలయ చైర్మన్లుగా పోటిల్లో ఉన్న టిడిపి ఆశావాహులు కూటమి ప్రభుత్వం ఎప్పుడు పాలక మండలను రద్దు చేసి నూతన పాలక మండలి నోటిఫికేషన్ విడుదల చేస్తారని ఎదురు చూస్తున్నారు. అ టిడిపిలోనే ఒక వర్గం వెంకటస్వామికి, మరో వర్గం సింగారెడ్డి జయచంద్రారెడ్డికి మొగ్గు చూపుతున్నారు. ఏదిఏమైనా గండి చైర్మన్ పదవి దక్కించుకొనేందుకు కోసం పోటాపోటీగా ఆశావాహులు బయటికి వస్తుండడంతో గండి చైర్మన్ పదవి ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ నెలకొంది.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాపాడు



మృతదేహాన్ని వెలికి తీస్తున్న గజ ఈతగాళ్లు

మండల పరిధిలోని నక్కలదిన్నె ఎస్సి కాలనీలో ఉన్న పంట పొలాలలోని బావి లో పడి బుధవారం వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య (35)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గ్రామ సమీపాన ఉన్న పంట పొలాలలోని బావిలో పడిపోయాడు. గమనించిన వారు వెంటనే గ్రామస్తులకు సమాచారాన్ని చేరవేశారు. గజ ఈత గళ్ళు బావిలోకి దిగి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు మధ్యం మత్తులో బావిలో పడినట్లు నిర్ధారణకు వచ్చారు. మృతునికి భార్య ,ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



దువ్వూరులో పార్వేట సందర్భంగా కోలాటం నిర్వహిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి. మండల వ్యాప్తంగా మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆరుగాలం శ్రమించే రైతన్న పంట ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులంతా ఒక చోటికి చేరుకొని పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని స్థానిక మెయిన్ బజార్‌లోని ఆంజనేయ స్వామికి మాజీ ఎంపిటిసి కూరాకుల. వెంకటేష్, ఓబులమ్మ దంపతులు వడమాల పూజ నిర్వహించారు. పాపాగ్ని నది తీరాన చిన్న పిల్లలు గాలిపటాలు ఎగురవేశారు. సంక్రాంతి సాంప్రదాయాలను మరవకుండా మహిళలు తమ ఇంటి ముంగిట రంగురంగులతో ముగ్గులను వేశారు. వివిధ ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎద్దుల కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవృషభాచలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. బుధవారం గ్రామోత్సవం వెంట కవి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే హరిదాసు, డూ డూ బసవన్నల నృత్య ప్రదర్శనలు, చెక్క భజన అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అలరించిన ముగ్గుల పోటీలు

స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి ఆలయంలో వద్ద ముగ్గుల పోటీలు అలరించాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్ని రంగు రంగుల హరివిల్లును వేశారు. ముగ్గుల పోటీల్లో తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి ఆలివేలమ్మ, మాధురీ, బాలం చైతన్య లక్ష్మి, పచ్చి పులుసు ప్రవీణాలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. దీంతో మొదటి బహుమతి కె. సంయుక్త, ద్వితీయ బహుమతి కె. అనుషా, తృతీయ బహుమతి నక్క. స్వాతి, నాల్గవ బహుమతి ముక్కా. వాణి, ఐదవ బహుమతి యారవ. నాగలక్ష్మి దక్కించుకున్నారు. పోటీల్లో పాల్గొన్న అందరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. దీంతో ప్రాంతం అంతా సంక్రాంతి నెలకొంది. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుగోపాల్ లు ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, రంగయ్య, పాలక మండలి సభ్యులు పద్మా రాజ్ కుమార్, సిద్దారెడ్డి, కోలా మారుతి, నామా శేఖర్, యడాల కృష్ణా, ఆరుసేర్ల సుబ్బ రాయుడు తో పాటు మహిళలు పాల్గొన్నారు.



వేంపల్లె : విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రసవత్తరంగా సాగిన బండలాగుడు పోటీలు

వేంపల్లె పరిధిలోని చింతల మడుగుపల్లెలో రసవత్తంగా బండ లాగుడు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి సహకారంతో చింతలమడుగుపల్లెకు చెందిన చిన్న ఓబుల్‌రెడ్డి, నల్లమేకల రామాంజనేయులు ఆధ్వర్యంలో చింతలమడుగుపల్లె గ్రామంలో బండ లాగుడు పోటీలు నిర్వహించారు. దీంతో వేంపల్లె మండల చుట్టూ ప్రాంతాల్లో ఉన్న రైతులు తమ ఎద్దులను తీసుకొని వచ్చి బండలాగుడు పోటీల్లో పాల్గొన్నారు. బండలాగుడు పోటీలు రసవత్తంగా జరగడంతో పండుగలకు వచ్చిన ప్రజలు, రైతులు భారీ సంఖ్యలో పోటీలను చూసేందుకు తరలి వచ్చారు. భారీ సంఖ్యలో ప్రజలు రావడంతో బండలాగుడు పోటీ చేసే ప్రాంతం కిటకిటలాడింది. అనంతరం బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కింద ఎద్దుల యజమాని సుధాకర్‌కు రూ 5000, రెండవ బహుమతి కె. వెంకటరమణకు రూ 4000 వేలు, మూడవ బహుమతి శివ రూ 4000 వేలు బహుమతులను జయరామిరెడ్డి ప్రదానం చేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎద్దుల యాజమానులకు కూడ నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నేత జయచంద్రారెడ్డి, శివకృష్ణా రెడ్డి, వెంకటేష్‌తో ప్రజలు పాల్గొన్నారు.

వ్య.కా.స ఆధ్వర్యంలో కోలాటం

గోపవరం : సంక్రాంతి కనుమ పండగ రోజున వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున బద్వేల్ పట్టణంలోని సుందరయ్య కాలనీలో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం బద్వేల్ మండల కార్యదర్శి పి. రవిచంద్ర మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో పాల్గొని ఆరోగ్యవంతులుగా ఉండాలని, నేటి కాలంలో యువత కొంతమంది చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ ఆరోగ్యం తమ చేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక రంగాన్ని యువతీ యువకులు ప్రజలందరూ ప్రోత్సహించాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ కోదండరామ కోలాట బృందం గురువు నిత్య పూజయ్య, జ్యోతి, రజిని, బ్రహ్మాయ్య ,చిన్నక్క , గ్రేస్ అమ్మ, చిన్నక్క పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా ప్రజలు మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ రోజున ప్రతి ఇంటి ముంగిట రంగవల్లులతో అందంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలకు అలంకరణ చేశారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. బుధవారం కనుమ వేడుక చేసుకున్నారు.

కన్నుల పండువలా పార్వేట ఉత్సవం

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి, చియ్యపాడు చెన్నకేశవస్వామి, వెదురూరు పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి పార్వేట ఉత్సవం బుధవారం కన్నుల పండువలా ప్రారంభమైంది. వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం అల్లాడుపల్లె దేవాలయాలు ఆవరణలో ప్రారంభమై విశ్వనాధపురం చేరుకుంది. చియ్యపాడు చెన్నకేశవస్వామి పార్వేట ఉత్సవం గ్రామంలో ప్రారంభమై బసిరెడ్డి పల్లె ,చెరుకొన్ పల్లె, రేపల్లె గ్రామాలకు చేరుకుంది. సంగమేశ్వర స్వామి వెదురూరు, నరహరి పురం, రాజుపాలెం గ్రామాలలో గ్రామోత్సవం నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పార్వేట సందర్భంగా గ్రామాలలో ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సిద్ధారెడ్డి పల్లె గ్రామంలో పిల్లలకు, పెద్దలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి హరికృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మొర్రైపల్లె గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన సోమాపురం యూత్ కు నగదు బహుమతిని, విన్నర్స్ గా నిలిచిన సిద్ధారెడ్డి పల్లె యూత్‌కు బహుమతులను అందజేశారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

మండల పరిధిలోని వెదురూరు, నరహరిపురం గ్రామాలలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని బండలాగుడు పోటీలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వెదురూరు, నరహరిపురం గ్రామాలకు బండలాగుడు పోటీలకు వచ్చాయి.



గోపవరంలో వ్య.కా.స ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

బండలాగుడు పోటీలలో విజేతలుగా నిలిచిన వృషభరాజముల యజమానులకు మొదటి బహుమతిగా రూ.1,00,116 ,రెండవ బహుమతి గా రూ.70,116, 3వ బహుమతిగా రూ.40 116, నాలుగో బహుమతిగా రూ.20116 , 5వ బహుమతిగా రూ.10116 లను బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ , టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి పార్వతీ సమేత సంగమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే ఃకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల పరిధిలోని పాత దువ్వూరులో వెలసిన శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా పాత దువ్వూరు నుంచి పుల్లారెడ్డిపేట వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఊరేగింపు కార్యక్రమం దువ్వూరు, పుల్లారెడ్డిపేటలో ఉన్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పారువేట ఉత్సవం గ్రామ పెద్దలు నిర్వహించారు గ్రామోత్సవం ముందర మహిళలచే కోలాటం నిర్వహించారు అక్కడికి వచ్చిన వారికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. దువ్వూరు ఎస్ఐవినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కడప : ప్రతి గుమ్మంలో సంక్రాంతి లక్ష్మీ కొలువై.. ప్రతి కుటుంబంలో సంతోషాల సిరులను నింపి.. భోగభాగ్యాలను ప్రసాదించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కుటుంబ సభ్యులతో కలిసి మకర సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. హరిదాసుల సందళ్ళతో బంగ్లాలోకి వచ్చిన గంగిరెద్దుకు కలెక్టర్ దంపతులు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి గంగిరెద్దుల యజమానికి సంక్రాంతి కానుకలు అందజేశారు.

జమ్మలమడుగు రూరల్ : చెల్లెలు సువర్ణలక్ష్మి 15వ వర్ధంతి పురస్కరించుకుని అన్నయ్య, ముద్దనూరు మండల వ్యవసాయ శాఖ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సంక్రాంతి పండగ పురస్కరించుకుని మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామంలో పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలో విద్యా బుద్ధులు నేర్చుకున్న చదువుల గుడి ప్రాంగణంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు, రంగ వల్లులు ముగ్గుల పోటీలు, కబడ్డీ, లెమన్ – టీ స్పూన్, రోపు (తాడు లాగే) టగ్ ఆఫ్ వార్, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపు పొందిన వారికి ప్రోత్సహక బహుమతులు వాటర్ బాటిల్స్, హాట్ బాక్స్ లు,విద్యా సామాగ్రి, పరీక్ష అట్టలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో గ్రామ యువ(యంగ్) టీమ్ టి.పురుషోత్తమ రెడ్డి,మారెడ్డి రాము, టి.ప్రతాప్ రెడ్డి, బిఎస్ఎఫ్ గ్రామ పెద్దలు, నవతరం యువతీ యువకులు పాల్గొన్నారు.



చాపాడు : నరహరిపురంలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు

యువత ప్రతిభకు కేరాఫ్

నెహ్రూ యువ కేంద్రం

యువతి, యువకులకు ప్రత్యేక శిక్షణ
యువ ఉత్సవ్ ద్వారా ప్రతిభ వెలికితీతకు కృషి
నెహ్రూ యువకేంద్ర, జిల్లా యువజన అధికారి మణికంఠ

ప్రజాశక్తి - కడప అర్బన్



మణికంఠ

యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్రంలో వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని యువ కేంద్రం, జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. యువతకు అందిస్తున్న సౌకర్యాలు, నెహ్రూ యువకేంద్ర ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై యువతి, యువకులకు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణ గురించి ఆయన ప్రజాశక్తికి వివరించారు.

యువ ఉత్సవ్

సమాజంలోని యువత శక్తి సామర్థ్యాలు వెలికి తీసేందుకు యువ ఉత్సవ్ కార్యక్రమం చక్కటి అవకాశం కల్పిస్తుందన్నారు. యువతి, యువకుల ప్రతిభ వెలికి తీసేందుకు 6 రకాల పోటీలు నిర్వహిస్తుందని, జిల్లా స్థాయిలో గెలిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని చెప్పారు. అన్ని స్థాయిలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్, మెమొంట్లు, నగదు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. యువతలోని ప్రతిభను ప్రదర్శించుటకు చాలా అద్భుతమైన వేదికను నెహ్రూ యువ కేంద్రం కల్పిస్తుందన్నారు. మాదక ద్రవ్యాలపై నెహ్రూ యువ కేంద్ర, జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు.

ఇంటర్ డిస్ట్రిక్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం

భారతదేశంలో విభిన్న సంస్కృతి సాంప్రదాయాలున్నాయని అందులో భాగంగా భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక జిల్లా పరిధిలోని వ్యక్తులు మరో జిల్లాకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజల యాస, భాష, సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేందుకు యూత్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

ఆటల పోటీలు

గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించుటకు స్పోర్ట్స్ మీట్ (ఆటల పోటీలు) నిర్వహిస్తుంటతామని, 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల యువతి, యువకులు ఈ ఆటల పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వాలీబాల్ పోటీలను నెహ్రూ యువ కేంద్ర నిర్వహిస్తుందన్నారు. ఇలాంటి వేదికలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

కడప నుంచి ఢిల్లీ పార్లమెంటుకు యువతులు

ప్రజాస్వామ్య విలువలు బలోపేతం చేయడమే లక్ష్యంగా యువత అభిప్రాయాలను తీసుకునేందుకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి వరకు నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపడుతుంది. విద్యార్థి దశలో విద్యార్థులకు సమాజం పట్ల ఉండే అవగాహన, పార్లమెంట్ పనితీరు, విధానం పైన పోటీలు నిర్వహిస్తారు. నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కడప జిల్లా యువతులు వరుసగా 3 సంవత్సరాలు పార్లమెంటులో ప్రసంగించే అరుదైన అవకాశం దక్కింది. పార్లమెంటులో యువతులు పాల్గొనడం జిల్లాలోని యువతి, యువకులకు **స్ఫూర్తిదాయకం..**

జిల్లాలో వివిధ కాలేజీలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు మిద్దె రూప (2022), అరుణ (2023), సానియా (2024) సంవత్సరాల లో పార్లమెంట్ ప్రాంగణంలో నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ప్రసంగించి, కడప జిల్లా పేరును దేశంలో ఉన్నతమైన స్థానంలో నిలిపారన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 2024, జూన్ 5న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని అటాహాసంగా ప్రారంభించామని పేర్కొన్నారు. తల్లి పేరు మీద మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, తల్లి పేరు మీద ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని యువతను భాగస్వామ్యం చేశామని వెల్లడించారు.

దేశ ప్రగతిని యువత దృష్టిలో ఉంచుకోవాలి

దేశ ప్రగతిని దష్టిలో ఉంచుకుని వికశిత భారత్, స్వర్ణాంధ్ర విజన్ - 2047ను యువత దష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. యువతలోని ప్రతిభను గుర్తిస్తూ, సేవ వైపు మళ్ళించడమే లక్ష్యంగా తమ కార్యక్రమాల రూపకల్పన కొనసాగుతుందన్నారు. దేశ అభివద్ధి యువశక్తి పైన ఆధారపడి ఉండడంతో వారిని సన్మార్గంలో నడిపించుటకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు, నెహ్రూ యువ కేంద్ర ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.



గండికోటను సందర్శిస్తున్న యువతీ, యువకులు (ఫైల్‌ఫొటో)



దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

విశ్రాంత తహశీల్దార్

సేవలు చిరస్మరణీయం

- ఎయిడెడ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కుర్లి చలపతి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రెవెన్యూ శాఖలో తహశీల్దార్‌గా వివిధ ప్రాంతాలలో పనిచేసి, విధినిర్వహణలో నీతినిజాయితీగా ఉంటూ పేదలకు సేవ చేసిన విశ్రాంత తహశీల్దార్ కుర్లి వెంకటేశు సేవ చిరస్మరణీయమని ఎయిడెడ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కుర్ల చలపతి పేర్కొన్నారు. పేదలకు నిత్యం అందుబాటులో ఉండి అధికారిగా, విద్యాప్రదాతగా, స్నేహితునిగా, తాత్వికుడిగా, మార్గదర్శకునిగా, స్ఫూర్తిప్రదాతగా నిలిచిన వెంకటేశు చిరస్మరణీయుడని తెలిపారు. ఆయనజ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు మూడు దశాబ్దాల కిందటే మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతిఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా వేముల మండలంలో ఉచితవైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం వెంకటేశు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అనంతపురం నర్సింగ్ కళాశాల అధిపతి కుర్లి సతీష్ కుమార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, గుంటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, వారి సతీమణి ప్రముఖ కంటివైద్యనిపుణురాలు విజయలక్ష్మి తదితరుల మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేముల మండలం బెస్తవారిపల్లెలోని వారి స్వగృహంలో ఏర్పాటు వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం డాక్టర్ శంకర్, విజయలక్ష్మి దంపతులు 30 మంది దివ్యాంగులకు నూతన దుస్తులు అందజేబ్బూశరు. ఈసందర్భంగా దివంగత వెంకటేష్ సతీమణి కుర్లి కృష్ణవేణమ్మ , చలపతి తదితరులను కుటుంబ సభ్యులు, దివ్యాంగులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తదనంతరం ఏర్పాటు చేసిన ఉచితవైద్యశిబిరంలో వేముల మండల పరిధిలోని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు ఇరికిరెడ్డిరఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్ , వేముల వికలాంగుల సంఘ నాయకులు చాగలేరు భాస్కర్, వేముల ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్ చలపతి, రిటైర్డ్ హెచ్‌ఎం హెడ్మాస్టర్ సావిత్రమ్మ, వెంకటేశు కుమారులు సతీష్ కుమార్, డాక్టర్ శంకర్, విజయలక్ష్మి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవానికి బుధవారం బయలుదేరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ ఆవరణంలో గ్రామ ఉత్సవాన్ని నిర్వహించి పర్వేటకు తరలించారు. బద్రిపల్లి, విశ్వనాధాపురం, కేతవరం లక్ష్మీపేట, వీరభద్రపురం, అల్లాడుపల్లె గ్రామాల మీదుగా పార్వేట ఉత్సవం కొనసాగుతుంది. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, నారపురెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వీరారెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.